క్లుప్తంగా

పారదర్శకంగా ఓటరు జాబితా తయారీ



కపిలేశ్వరపురంలో బీఎల్‌వోలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

కపిలేశ్వరపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 19 పంచాయతీల్లో నూతన ఓటరు ముసాయిదా జాబితాను పారదర్శకంగా తయారు చేస్తున్నట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించిన నేపథ్యంలో అందిన దరఖాస్తులను పరిశీలించారు. వాటిని ఆన్‌లైన్ చేసి ఉన్నతాధికారులకు నివేదించారన్నారు. వాటిపై ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. జాబితా తయారీలో కృషి చేస్తున్న బీఎల్‌ఓలను అభినందించారు. మండలంలోని 19 పంచాయతీల వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మట్టిని సరిచేసి సమస్యకు పరిష్కారం



వీధివారిలంకలో మట్టిని సరిచేస్తున్న పొక్లెయిన్

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంక ఎస్సీ పేట మెయిన్ రోడ్‌లో ఎత్తుపల్లాలుగా ఉన్న మట్టిని సర్పంచ్ వీధి వెంకటరెడ్డి పొక్లెయిన్ సాయంతో సరి చేయించి సమస్యను పరిష్కరించారు. వర్షాలకు పల్లం కావడంతో నివాసితులు తరచూ మట్టితో మెరక చేసుకుంటున్నారు. దీర్ఘకాలిక ప్రక్రియలో రహదారి ఎత్తు పల్లాలుగా మారింది. రహదారిపై రాకపోకలు సాగించే వారు అవస్థ పడుతున్న విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా రహదారి మట్టిని సరిచేసి సమస్యను పరిష్కరించారు.

నేడు మండపేటలో మెప్మా బజార్

మండపేట: పట్టణంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులతో బుధవారం మెప్మా బజార్ ఏర్పాటు చేసినట్టు మెప్మా టీఈ అనంతలక్ష్మి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, కమిషనర్ టి. రామ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. మండపేట, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డ్వాక్రా సభ్యులను ప్రోత్సహించాలని టీఈ అనంతలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి గ్రామస్తుల సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయిని దేవిని సత్కరిస్తున్న గ్రామస్తులు

కె.గంగవరం: మండలంలోని బాలాంత్రం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని మల్లెడ దుర్గాదేవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు దక్కించుకున్న సందర్భంగా గ్రామస్తులు మంగళవారం ఆమెను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరాల కృష్ణకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ తోలేటి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కోట సత్తిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సలాది కొండయ్య, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం పెదవీధిలోని కృష్ణుడి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ అన్నసమారాదానలో పరిసర గ్రామాల నుంచి సుమారు మూడువేల మంది ఈ పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. గత గురువారం కృష్ణాష్టమి పురస్కరించుకుని ఆలయంలో స్వామికి వచ్చిన విరాళాలకు తోడు పలువురు స్థానిక దాతల ఆర్థిక సహకారంతో ఈ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించామని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

కొత్తగా 530 పింఛన్లు మంజూరు

కపిలేశ్వరపురం: మండలంలో వివిధ గ్రామాలకు చెందిన అర్హులకు కొత్తగా 530 పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. వాటిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు లబ్ధిదారులకు అందజేయనున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామాల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

సాగులో సస్యరక్షణే కీలకం

- మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- ఆర్బీకేల ద్వారా రైతులకు సూచనలు, సలహాలు



ఎరువులు జల్లుతున్న రైతు

రామచంద్రపురం: రైతులు వరి సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని, హెచ్చరిస్తున్నారు. ఖరీఫ్ సాగు చేస్తున్న వరి పంట ప్రస్తుతం అంతటా నాట్లు వేయగా పంట పచ్చగా ఉంటూ పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఉండటంతో వ్యవసాయ శాఖ సిబ్బంది సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తున్నారు.

జింక్ లోపం నివారణ

జింక్ లోపం ఉన్న పంటలో 3 లేదా 4 ఆకులతో ఈనె పాలి పోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెలకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి ఆకు పెళుసుగా ఉంటుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

కాండం తొలచు పురుగు, నివారణ..

నారుమడి నుంచి పూత దశ వరకు వరి పంటకు కాండం తొలచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వ చనిపోవటం, పూత, దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీని వల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్బొఫ్యూరాన్ 3 గ్రాములు గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకుముడత

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయటం వలన ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

సుడిదోమ

సుడిదోమ వ్యాపిస్తే వరిపోలంలో దోమ ఉధృతి వల్ల ఉన్న చోట పంట ఎండిపోతుంది. నివారణకు ట్రైసైక్లోజోల 0.6 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. గట్లపై కలుపు నివారించుకోవాలి.

ఆకు ఎండు తెగులు.. నివారణ

బ్యాక్టీరియా వలన ఆకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు తగ్గిస్తూ వేసుకోవాలి.

పొట్టకుళ్లు తెగులు...

వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బెండజోమ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పొట్ట దశలో ఒక సారి, వారం రోజుల తరువాత రెండోసారి పిచికారీ చేసుకోవాలి

నీటి యాజమాన్యం..

పిలకలు వేసే దశలో పైరు దుబ్బు వేయటం పూర్తయ్యే వరకు పొలంలో 2 సెంటీమీటర్లు నీరు ఉండాలి. చిరు పొట్ట దశలో పూతదశలో పొలంలో 5 సెంటీమీటర్లు నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం..

భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా చేపట్టాలి. నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్నపాటి మెళకువలు అనుసరించటం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. ఆర్బీకేల ద్వారా రైతులను చైతన్య పరుస్తున్నాము. రైతులకు అవసరమైన ఎరువులు ఆయా గ్రామా ల్లోని ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి.

– సత్యప్రసాద్, ఏఓ, రామచంద్రపురం మండలం

విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి

మంత్రి వేణు



డిగ్రీ కళాశాలలో తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి వేణు తదితరులు

రామచంద్రపురం: నియోజకవర్గంలో విద్యా ప్రమాణాలు ప్రోత్సహించడంలో భాగంగా పాఠశాలలతో పాటు కళాశాలలను కూడా అభివృద్ధి పరచుకోవడం జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను మంగళవారం మంత్రి వేణు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కళాశాలలో చదివే విద్యార్థులు తరగతుల్లో గతంలో సరైన సౌలభ్యం లేకపోవడం ద్వారా అసౌకర్యానికి గురయ్యేవారని, కళాశాల యాజమాన్యం విజ్ఞాపన మేరకు కళాశాలల అభివృద్ధి చేసే విధంగా కృషి చేయడం జరిగిందని, దాని ఫలితంగా నూతన తరగతి గదులను ప్రారంభించుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో రాజు, కౌన్సిలర్ సాయి ప్రసాద్, బావాల భద్రరావు, పూర్వ విద్యార్థులు పారిశ్రామిక వేత్త అడ్డూరి జగన్నాథవర్మ, ప్రముఖ వైద్యుడు సి.స్టాలిన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

రాయవరం: మండలంలోని విలేజ్ హెల్త్ క్లినిక్కులు, గ్రామ సచివాలయాల్లో ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రారంభం కానున్నట్టు ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. గ్రామాల్లో అందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరికీ సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిషత్, రెవెన్యూ శాఖల సంయుక్త పర్యవేక్షణలో ఆరోగ్య శిబిరాలను నిర్వహించి, వ్యాధి లక్షణాలు ఉన్న వారికి సమీప రిఫరల్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు అందించడడం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, వలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కార్యక్రమంపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

ఇందుకు ఈ నెల 30న వి.సావరం, అక్టోబరు 3న కురకాళ్లపల్లి, 4న సోమేశ్వరం–1, 5న చెల్లూరు–2, 6న నదురుబాద, 7న వెంటూరు–1, 10న రాయవరం–2, 11న వెంటూరు–2, 12న వెదురుపాక, 13న కూర్మాపురం, 17న పసలపూడి–2, 18న చెల్లూరు–1, 19న పసలపూడి–1, 20న చెల్లూరు–3, 21న సోమేశ్వరం–2, 25న మాచవరం–2, 26న లొల్ల గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక వైద్య బృందాల పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. వైద్య శిబిరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మండపేట: పట్టణంలోని ది మండపేట మోటార్ మెకానికల్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యుని కుటుంబానికి యూనియన్ అండగా నిలిచింది. సంఘ సభ్యుడు రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ.40,000 ఆర్థిక సాయం అందించింది. సంఘాధ్యక్షుడు నాగులాపల్లి ఈశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఈ మొత్తాన్ని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ తమ సంఘ సభ్యులకు ఎలాంటి కష్టమొచ్చినా తమ యూనియన్ బాసటగా నిలుస్తుందన్నారు. సంఘ నాయకులు శీలామంతుల సత్యనారాయణ, ఈదిపల్లి సాంబశివ, సలాది కోటి, గుత్తుల గణేష్, మగ్గం రాంబాబు, వల్లూరి వెంకట్రావు, అత్తిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



రైతు తోటలో కొబ్బరి చెట్టుకు పళ్లెం తయారు చేస్తున్న ఉపాధి కూలీలు

కపిలేశ్వరపురం: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు ఉన్న కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించే లక్ష్యంతో కృషి చేస్తున్నట్టు ఏపీఓ వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పంట కాలువల పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. జగనన్న కాలనీల్లో ఇల్లు కట్టుకుంటున్న ఉపాధి కూలీకి ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు 90 రోజులు పని కల్పిస్తున్నామన్నారు. ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇస్తూ కోరుమిల్లిలో కొబ్బరి చెట్ల చుట్టూ పళ్లాలు తయారు చేస్తున్నారన్నారు. కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో మునగ, జామ తదితర ఉద్యాన పంటల సాగులో ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఏపీఓ వెంకటలక్ష్మి, జేఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గణపయ్య రాకకు ఘనంగా ఏర్పాట్లు

- చవితి వేడుకలకు మండపాల ముస్తాబు
- మండపేటలో 60కి పైగా కూడళ్లలో కొలువుదీరనున్న గణనాథుడు



మండపేట గొల్లపుంత కాలనీలో సిద్ధమవుతున్న మండపం



రాయవరంలో గణేష్ ఉత్సవాలకు సిద్ధం చేస్తున్న చలువ పందిరి

మండపేట: విఘ్నాలను తొలగించే గణనాథుని రాక కోసం ఊరూవాడా ముస్తాబవుతున్నాయి. స్వామివారిని ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీలు మండపాలను సిద్ధం చేస్తున్నాయి. ఈనెల 18న వినాయక చవితి నేపథ్యంలో వేడుకల సందడి మొదలైంది. ఆలయాల వద్ద ఉత్సవ కమిటీలు మండపాల కోసం రాట ముహూర్తం చేసి పనులు ప్రారంభించారు. వీధుల్లో ఎక్కడ చూసిన పోటాపోటీగా కర్రలు, కొబ్బరి ఆకులు, రంగురంగుల క్లాత్‌లు, విద్యుత్తు లైట్లతో మండపాలు సిద్ధం చేస్తున్నారు. చిన్నాపెద్దా, ఆడ మగా తారతమ్యం లేకుండా మండపం పనుల కోసం తమవంతు సహకారం అందిస్తున్నారు. పట్టణంలోని వల్లూరి వారి వీధి, గాంధీనగర్, సైదిల్‌పేట, బ్యాంకు కాలనీ, గొల్లపుంత కాలనీ, కొండపల్లి వారి వీధి, పాటిమీద, ధర్మగుండం, న్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో మొత్తం 60కు పైగా మండపాలను ఏర్పాటు చేస్తున్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు

మరోపక్క మండపాల్లో కొలువు దీరేందుకు గణనాథులు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నారు. రాజస్తాన్‌కు చెందిన పలు కుటుంబాల వారు పట్టణంలోని ఆలమూరు రోడ్డు, రామచంద్రపురం రోడ్డులలో వినాయక ప్రతిమల తయారీ చేస్తున్నారు. గత ఐదు నెలలుగా వారు విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. ఉత్సవ కమిటీలు ఇచ్చిన ఆర్డర్ల మేరకు మూడు అడుగుల నుంచి 15 అడుగుల వరకు విగ్రహాలు తయారు చేశారు. పండుగ దగ్గర చేసి విగ్రహాలను కమిటీ సభ్యులు తీసుకు వెళతారని రాజస్తాన్‌కు చెందిన కళాకారుడు కిషన్ తెలిపారు.

రాయవరం మండలంలో..

రాయవరం: గణేష్ ఉత్సవాలకు గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 18న నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఆలయాల వద్ద చలువ పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. రాయవరం, లొల్ల, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెదురుపాక, కూర్మాపురం, కురకాళ్లపల్లి, నదురుబాద, సోమేశ్వరం, వెంటూరు గ్రామాల్లో గణేష్ ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని యువకులు ఉత్సవ కమిటీలుగా ఏర్పడి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ గ్రామంలో దాదాపుగా ఐదారు చోట్ల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో 10 నుంచి 14 అడుగుల భారీ గణనాథ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు విగ్రహాల తయారీదార్లకు ఆర్డర్లు కూడా ఇచ్చారు. అదేవిధంగా గ్రామాలకు సైతం పాకిన లడ్డూ సంస్కృతిలో భాగంగా లడ్డూలను వినాయకుడి చేతిలో ఉంచేందుకు స్వీట్ స్టాల్స్‌కు ఉత్సవ కమిటీలు ఆర్డర్లు ఇచ్చాయి.

భూముల రీ సర్వే సక్రమంగా జరపాలి

ఆత్రేయపురం: అగ్రికల్చర్ ల్యాండ్ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ కంఠం భూములకు సంబంధించిన మ్యాప్‌లు సిద్ధమైనట్లు భూముల సర్వే సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆత్రేయపురం, మెర్లపాలెం, లొల్ల, వాడపల్లి, కట్టుంగ, పులిదిండి, వసంతవాడ గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ యు.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

13 పోలింగ్ కేంద్రాల మార్పు

పి.గన్నవరం: నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల పాత భవనాలు తొలగించి కొత్తవి నిర్మిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని 13 పోలింగ్ స్టేషన్లను మార్పు చేస్తున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణారెడ్డి తెలిపారు. 9 కేంద్రాలను పక్కనే ఉన్న భవనాలకు, మరో నాలుగు కేంద్రాలను అదే లొకేషన్లో మరో ప్రాంతానికి మార్చుతున్నట్టు ఆయన వివరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాల డోర్ టు డోర్ వెరిఫికేషన్ కార్యక్రమం పూర్తయిందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. తహసీల్దార్లు జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సీహెచ్ నాగలక్ష్మమ్మ, మంగతాయారు పాల్గొన్నారు.

గనిపోతురాజు ఆలయానికి మహర్దశ

- రూ.10 లక్షలతో రిటైనింగ్ వాల్ పనులు
- పరిశీలించిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఆలయం వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకన్నబాబు తదితరులు

మండపేట: కేశవరం గ్రామంలోని గనిపోతురాజు స్వామివారి ఆలయం కొత్త రూపును సంతరించుకుంటోంది. ఇప్పటికే రూ.ఆరు లక్షల వ్యయంతో ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులు చేశారు. తాజాగా మరో రూ.10 లక్షల వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కేశవరంలోని గనిపోతురాజు స్వామి ఆలయం మండపేటతో పాటు రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, రామచంద్రపురం తదితర నియోజకవర్గాల్లో ప్రసిద్ధి చెందింది. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన వారు స్వామివారి వద్దకు తీసుకు వచ్చి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడే వంట చేసుకుని సహపంక్తి భోజనాలు చేసి వెళుతుంటారు. ఏటా సంక్రాంతి పండుగ నుంచి జనవరి నెలాఖరు వరకూ జరిగే స్వామివారి తీర్థమహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల కృషితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల వసతి కోసం గతంలో నిర్మించిన షెడ్ శిథిలావస్థకు చేరుకోగా రూ. 1.5 లక్షలు దేవదాయశాఖ నిధులతో షెడ్ పునర్ నిర్మించారు. రూ.మూడు లక్షలతో కార్యాలయం భవనం పై అంతస్తు నిర్మించారు. భక్తుల కోసం రూ.1.5 లక్షల దాతల సహకారంతో గత ఏడాది అదనపు షెడ్డు నిర్మాణం చేశారు.

రిటైనింగ్ వాల్‌తో పెరగనున్న గుడి విస్తీర్ణం

ప్రస్తుతం గుడి ఉత్తరం వైపున పెద్ద చెరువు ఉండడంతో గుడికి చెరువుకు మధ్య కేవలం 10 అడుగుల విస్తీర్ణం మాత్రమే ఉంది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చినపుడు ఆలయం వద్ద గట్టు ఇరుకుగా మారి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చెరువుకు రక్షణ గోడ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కాగా గట్టు విస్తీర్ణం పెంచేందుకు దేవదాయశాఖ నుంచి ఎమ్మెల్సీ తోట రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించగా నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. నిర్మాణ పనులను మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు పరిశీలించారు. ఉత్తరం వైపు విస్తీర్ణం 25 అడుగులకు పెంచుతూ చెరువులోకి 40 మీటర్లు మేర రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పై ఎత్తులో రక్షణగోడ నిర్మిస్తామన్నారు. దీనవలన ఆలయ విస్తీర్ణం భారీగా పెరగడంతో పాటు భక్తులకు సౌకర్యవంతంగా, రక్షణగా ఉంటుందన్నారు. ఆలయం, గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు వెంకన్నబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కూసు అబ్బు, వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దంకి రమణ, తుపాకుల ప్రసన్నకుమార్, చేబోలు సత్తిబాబు, కుర్రా తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ ఈ-కేవైసీ తప్పనిసరి

కాజులూరు: గ్రామాల్లో తొలకరి పంట సాగుచేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని ఆర్బీకేల్లో జరుగుతున్న ఈ-కేవైసీ కేంద్రాలను ఏఓ సందర్శించారు. గొల్లపాలెం ఆర్‌బీకే-2లో వీఏఏ వనుం రమ్య అధ్యక్షతన జరిగిన రైతులు, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో 19,500 ఎకరాల సాగుభూమికి గానూ 17 వేల మంది రైతు ఖాతాలు ఉన్నాయన్నారు. వీరందరూ తప్పనిసరిగా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ-క్రాప్ బుక్రింగ్ చేయించుకుని ఈ-కేవైసీ వేయాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ-కేవైసీ వేయడానికి వచ్చే రైతులు తప్పనిసరిగా తమ మొబైల్ ఫోన్లను ఓటీపీ నిమితతం తమతో తీసుకు రావాలన్నారు.

నూతన విద్యుత్ కనెక్షన్లకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్

రామచంద్రపురం: రామచంద్రపురం టౌన్ సెక్షన్ పరిధిలో నూతన విద్యుత్ కనెక్షన్లను సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని విద్యుత్ శాఖ రామచంద్రపురం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కంచుమర్తి మురళీమోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్‌లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామచంద్రపురం టౌన్, మండలంలోని యనమదల, ఓదూరు, మాలపాడు, చోడవరం, నరసరావుపేట గ్రామాల్లోని సచివాలయంలో విద్యుత్ సర్వీసుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను చేయటం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ సర్వీసుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ సైట్‌లో విద్యుత్ ఉద్యోగులు మీ ఇంటింటికి వచ్చినప్పుడు ఆధార్ నంబర్‌తో మీ విద్యుత్ సర్వీసులను అనుసంధానం చేయించుకోవచ్చని తెలపారు. ఏపీఈపీడీసీఎల్ రెవెన్యూ కార్యాలయంలో, ఏఈ కార్యాలయాలలోను మీ ఆధార్ జిరాక్స్, విద్యుత్ సర్వీసు తీసుకుని వెళితే ఆధార్‌ను అనుసంధానం చేస్తారని, వినియోగదారులందరూ సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: మహాశివరాత్రి రోజున కోటిపల్లి గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ మృతి చెందిన అద్దంపల్లి గ్రామ బాలుడు పంపన శశి వీరేంద్ర కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బాలుని తండ్రి పంపన శ్రీనివాస్ మంత్రి వేణుకి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె.గంగవరం మండల వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, నాయకులు చింతపల్లి వాసు, యనమదల శ్రీనివాస్, కట్టా గోవిందు, మేడిశెట్టి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాచరలో స్వామిత్వ సర్వే



మాచరలో ఇంటి కొలతలను నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామంలో స్వామిత్వ సర్వే జరుగుతోంది. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో కార్యదర్శి చినబాబు ఆధ్వర్యంలో సర్వేయరు తదితర సచివాలయ ఉద్యోగులు సర్వేలో సేవలందిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి యాజమాన్య హక్కుల మేరకు కొలతలను శాస్త్రీయంగా తీసుకుని సర్వేలో నమోదు చేస్తున్నారు. సంపూర్ణ హక్కును పారదర్శకంగా అందించే లక్ష్యంతో స్వామిత్వ సర్వేను చేస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు.

15న స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

కపిలేశ్వరపురం: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారుల ఆదేశాలపై ఈనెల 15న కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ కె.తాతారావు తెలిపారు. కబడ్డీ, టెన్నికాయిట్, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, యోగా, త్రో బాల్ అథ్లెటిక్స్ తదితర తొమ్మిది విభాగాల్లో పాల్గొనేందుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. వ్యాయామోపాధ్యాయులు గుబ్బల వేణుగోపాలరావు, వాసంశెట్టి రవికుమార్, మేకా సత్యనారాయణ, ముత్తా సత్యనారాయణ, కె.దుర్గాప్రసాద్, ఉన్నీసా బేగం పర్యవేక్షణలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ తెలిపారు.

రేపు విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు మంగళవారం నాటొక ప్రకటనలో తెలిపారు. ఆలయ తనిఖీదారు, దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చక సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొంటారని తెలిపారు.